# హంసలను వేటాడొద్దు [12]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [12]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జూన్ 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2878

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [12]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** నోవా యురీవ్నాకు ప్రస్తుతం ఉన్న ఇంటిగది చికాకుగా మారింది. ఆమె కొత్త గది ఇప్పించమని అధికారుల్ని అడిగినా ఫలితం లేదు. కప్పు నుండి వాన నీరు కూడా పారుతోంది. యెగార్ తాగుబోతు స్నేహితుడు క్రోక్ ఆమెకు తారసపడతాడు. ఇల్లు బాగు చేస్తానని మాట ఇస్తాడు. ఆమె దగ్గర నుంచి డబ్బు గుంజాలని అతని ఆలోచన. పని అంచనా కోసం తన తోటి పని వాళ్లని పిలుచుకొస్తానని చెప్పి వెళ్లి యెగార్, ఫిల్‌లను తీసుకువస్తాడు. యెగార్ నోవాని చూడగానే ఆమె తన కొడుకు కోల్కాకు టీచరని గుర్తుపడతాడు. ఆమెని మోసం చేయటం ఇష్టం లేక, క్రోక్ ఫిల్‌ల పథకానికి విరుద్ధంగా ఇంటిచూరు బాగు చేయటానికి చాలా తక్కువ మొత్తం అడుగుతాడు. బయటకు వచ్చిన తర్వాత క్రోక్, ఫిల్‌లు ఇద్దరూ కలిసి అతణ్ణి చావబాదుతారు. **ఇక చదవండి:—**

## 12

ఫ్యొడార్ ఇపటొవిచ్ తన బకాయిలన్నీ తీర్చేశాడు, కావలసిన కాగితాలన్నీ సమకూర్చుకున్నాడు, అన్నీ సక్రమంగా ఉండేట్లు చూసుకున్నాడు. పుస్తకాల దుకాణంలో రిబ్బను ఉన్న ఒక ఫోల్డరు కొని, కాగితాలన్నింటినీ దాంట్లో పెట్టి, ప్రాంతీయ కేంద్రానికి బయలుదేరాడు. ఇదంతా కొత్త అటవీ వార్డెనుకు లెక్కలు చెప్పటానికి.

ఆ ఇంటికి అతడికి బాగానే ఖర్చయ్యింది. తన పిల్లల నోటికాడి కూడు తియ్యాల్సి రాకపోయినప్పటికీ అది బాధ కలిగిస్తోంది, పిచ్చి లేపుతోంది. ఎంత బాధ కలిగించే విషయం! చాలా క్రూరమైన విషయం.

ఈ కారణంగా ఫ్యొడార్ ఇపటొవిచ్ దారి పొడవునా తన నోరు మూసుకుని ఉన్నాడు. తన కుత్సిత ఆలోచనలనే మళ్లీ మళ్లీ నెమరు వేస్తూ తిట్లను సమకూర్చుకుంటున్నాడు. శాపనార్థాలు కాదు – అతనికంటే ముందు అటువంటివి వందల సంఖ్యలో కూర్చారు – బాధ కలిగించే తిట్లు. అవి బయటకు బాగానే ఉంటాయి కానీ లోపలంతా విషం కలిగి ఉంటాయి. దాంతో ఆ అటవీ వార్డెను, వాడి దుంపతెగ, రెండు వారాలపాటు జుట్టు పీక్కుంటూ కూర్చుంటాడు, కానీ నన్ను అనటానికి మాత్రం ఏమీ ఉండదు. ఏమీ ఉండదు.

అతడు క్లిష్టమైన సమస్యలో ఉన్నాడు. అందుకే తన తోటి ప్రయాణికులతోటి మాట కలపలేదు. పోసుకోలు కబుర్లతో తన దృష్టిని మరల్చదలుచుకోలేదు.

కొత్త అటవీ వార్డను యూరి పెట్రోవిచ్ చువలోవ్‌తో తన సమావేశం గురించి అతడు ఆలోచించసాగాడు. ఈ కొత్త వార్డెను గురించి అతడికి ఏమీ తెలియకపోవటంతో అతడు ఈ సమావేశం గురించి భయపడుతున్నాడు.

యూరి పెట్రోవిచ్ జీవితం అంత సంతోషమయం కాకపోయినప్పటికీ స్వతంత్రమైనది. వాళ్ల నాన్న విజయోత్సవ దినం తరువాత సరిగ్గా ఒక సంవత్సరం జీవించాడు. తమ కమాండర్ కోసం నిశ్శబ్దంగా వేచి ఉన్న పటాలం దగ్గరకి నలభైఆరేళ్ల వయస్సులో అతడు వెళ్లిపోయాడు. లెనిన్‌గ్రాడ్ ముట్టడితోనూ, యుద్ధరంగం నుంచి ఉత్తరం కోసం వేచి ఉన్న వెయ్యి రోజులతోను అలసిపోయిన అతడి తల్లి ఆ తరువాత కొద్ది రోజులకే చనిపోయింది. అతడి తల్లి నిశ్శబ్దంగా జీవించింది, నిశ్శబ్దంగానే మరణించింది. పడుకునేముందు అతడికి పాలుకుడుపుతూ ఆమె చనిపోయింది, ఆమె చనిపోయిందని గ్రహించని బాలుడు చల్లబడిన ఆమె చన్నును చీకుతూనే ఉన్నాడు.

ఈ విషయం పక్కింటావిడ చాలా సంవత్సరాల తరువాత యూరీకి చెప్పింది. ఆనాడు... ఆనాడు జీవరహితమైన ఆ గది నుంచి పక్కింటావిడ యూరీని తన గదికి తీసుకెళ్లింది. అది ఒక విధవకి చెందిన ఖాళీ గదే అయినప్పటికీ అందులో కనీసం జీవం ఉంది. పదహారేళ్లవరకు అతడికి ఆమె తప్ప మరో తల్లి తెలియదు. తన మొదటి పాస్‌పోర్టు కోసం పోలీసు స్టేషనుకు వెళ్లే రోజుకోసం అతడు ఎంతగానో ఎదురుచూసాడు. అందుకు కావలసిన కాగితాలన్నీ ముందుగానే సిద్ధం చేసుకున్నాడు. ఆ రోజు తన జనన ధ్రువీకరణ పత్రం కోసం తల్లిని అడిగాడు. ఆమె వింతగా, ఉన్నట్టుండి మౌనంగా మారిపోయి గరుకుబారిన ఎముకల్లాంటి వేళ్లతో పాలిపోయిన పెదాలను రుద్దుకోసాగింది.

“ఏమిటి, అమ్మా?”

“బాబూ...” ఆమె నిట్టూర్చింది. కిర్రుమంటున్న సొరుగునుంచి ఒక పాత పుస్తకంలోని పసుపుబారిన సైనికుని ఉత్తరాలు, “యుద్ధరంగంలో మరణం” నోటీసులు, విద్యుత్తు బిల్లులు, జనన ధ్రువీకరణ పత్రాలు అన్నీ కలగలిపి ఉన్న కాగితాలను బయటకు తీసింది. కావలసిన కాగితం ఆమెకు దొరికింది కానీ దానిని కొడుకుకి ఇవ్వలేదు. “కూర్చోరా.”

అతడు వినయంగా కూర్చున్నాడు. ఏం జరిగిందో తెలియటంలేదు కానీ ఏదో జరిగింది. కొంత సందిగ్ధతతో, మెల్లగా నవ్వుతూ మళ్లీ అడిగాడు, "ఏమయ్యింది, అమ్మా?"

అతడివంక తేరిపార చూస్తూ, నవ్వుతూ ఆమె ఇంకా మౌనంగానే ఉంది. కొంతసేపటికి, "నువ్వు నా కొడుకుగా పెరిగావు, యూరి, నేను బతికి ఉన్నంతవరకు నా కొడుకుగానే ఉంటావు. నేను బతికి ఉన్నంతవరకు, యూరి! కానీ ఈ కాగితం మీద, ఈ జనన ధ్రువీకరణ పత్రంమీద వేరే వాళ్ల పేర్లు రాసి ఉన్నాయి. ఇంకొక అమ్మ, ఇంకొక నాన్న. నీకు వాళ్ల పేరుమీద పాస్‌పోర్టు వస్తుంది, అంతే. అది మంచి పేరు, వాళ్లు మంచి మనుషులు. ఇప్పటినుంచి నిన్ను సెమెనోవ్ అని కాకుండా చువలోవ్ అంటారు. యూరి చువలోవ్, అంటార్రా..."

దాంతో యూరి ఇంటిపేరు కాస్తా చువలోవ్‌గా మారింది. అయినప్పటికీ అతడు ఆ విధవరాలైన ముసలి, అరకొర అక్షరాస్యత ఉన్న మౌన మహిళను అమ్మా అని పిలుస్తూ, అమ్మగానే భావించాడు. మొదట్లో దాని గురించి అంతగా ఆలోచించకుండా అలవాటు ప్రకారం పిలిచినప్పటికీ ఆ తరువాత ఎంతో ప్రేమతోనూ, గౌరవంతోనూ అమ్మా అని పిలిచేవాడు. కళాశాల నుంచి పట్టా పొందిన తరువాత అతడు ఎంతో తిరిగాడు — కిర్గిజియాలో, అల్తాయ్ కొండలలో, సైబీరియాలో, ఓల్గా ప్రాంతంలో పనిచేశాడు. అయితే, అతడు ఎక్కడ ఉన్నప్పటికీ ప్రతి ఆదివారం అమ్మకి ఉత్తరం రాసేవాడు:

"ప్రియమైన అమ్మా," –

ఏమాత్రం తొందరపడకుండా, ఆమె స్వయంగా చదువుకోటానికి వీలుగా చాలా కష్టపడి పెద్దపెద్ద అక్షరాలలో రాసేవాడు.

ఆమె తన ఆరోగ్యం గురించి వివరాలతోనూ (ఉత్తరాల్లో ఆమె ఎప్పుడూ ఆరోగ్యంగానే ఉండేది), తన పరిమితమైన ప్రపంచానికి సంబంధించిన విశాషాలను తెలియచేస్తూ వెంటనే బదులు ఇచ్చేది. ఇటీవలనే ఆమె ఉత్తరాల్లో ఎంతో జాగ్రత్తగా — అతడికి ఇబ్బంది, నొప్పి కలిగించకుండా — ముసలివయస్సులోని తన ఒంటరితనం గురించి, జీవితంలో సంతోషం లేకపోవటం గురించి సూచిస్తూ వస్తోంది:

"మారియా గ్రిగొరీవ్నాకి అప్పుడే ఇద్దరు మనుమళ్లు, ఇప్పుడు ఆమె జీవితం ఎంతో సందడిగా గడిచిపోతోంది..."

కానీ యూరి పెట్రోవిచ్ చతుర్లాడుతూ బదులిచ్చేవాడు. ప్రస్తుతానికి ఆ విషయాన్ని నవ్వులతో తీసిపారేసి ఆమె ఆరోగ్యంపై ఎక్కువ దృష్టిపెట్టేవాడు. నీ ఆరోగ్యం జాగ్రత్త, అమ్మా. ఎవరి జీవితం ఎక్కువ సందడిగా ఉంటుందో అప్పుడు చూద్దాం. కాలమే అన్నిటికీ సమాధానం చెపుతుందంటారు. ప్రేమతో...

అయితే ఫ్యాడార్ ఇపటొవిచ్‌కి ఇవేమీ తెలియవు. పట్టణంలో పెరిగిన యూరికి ఎదురుగా కూర్చుని, పొడుం డబ్బాల నుంచి చూస్తున్నట్టు కనుబొమ్మల కిందనుంచి చూస్తూ కూర్చున్నాడు. ఫోల్డర్‌లోని కాగితాలు చూసిన తరువాత అతడు ఏం అంటాడోనని ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

యూరి ఎలా జీవిస్తున్నాడో తెలుసుకోటానికి దొంగ చూపులతో ఉండీ ఉండీ చుట్టూ పరికించి చూడసాగాడు. ఈసారి అటవీ అధికారి అతడి కార్యాలయానికి కాకుండా హోటలు గదికి రమ్మన్నాడు. ఇలా గదికి రమ్మనటంలో అతడి ఉద్దేశం ఏమై ఉంటుందా అని ఫ్యాడార్ ఇపటొవిచ్ ఆలోచించసాగాడు. గదిలో ఒంటరిగా ఉన్నప్పుడు తననుంచి ఏమైనా ఆశిస్తున్నాడా?

అయితే, ఇప్పుడు ఎటువంటి పొరపాట్లకి అవకాశం ఇవ్వకూడదు! ఆ కారణం వల్ల ఫ్యాడార్ ఇపటొవిచ్ మొదటి ప్రశ్నకోసం ఆందోళనతో ఎదురు చూస్తున్నాడు. అది ఎలా ఉంటుంది, ఏ రాగం పలుకుతుంది? డప్పు వాయించినట్టు వాయించవచ్చు, లేదా వాయులీనంతో హృదయాన్ని కరిగించవచ్చు – అంతా మొదటి ప్రశ్నతో తేలిపోతుంది. దానికి ఫ్యాడార్ ఇపటొవిచ్ బిగిసిన కండరాలతో సిద్ధంగా ఉన్నాడు. అతడి వళ్లంతా చెవుల మాదిరి ఉంది.

“అంతా బాగానే ఉంది, కానీ రక్షిత ప్రాంతంలో చెట్లు కొట్టటానికి అనుమతి ఏది?”

అయితే అదన్నమాట. పోలీసువాడి ఈల. తెలిసింది. తనని మరుగుతున్న నీళ్లల్లో పడేశారు, అందులో ఫ్యాడార్ ఇపటొవిచ్‌కి ఏమాత్రం అనుమానం లేదు. అతడు తన విస్మయాన్ని దాచుకుంటూ, మర్యాద కోసం అంతా లోపలే బిగబట్టుకుని, బల్లమీదకు వంగి ఒక కాగితాన్ని చూపిస్తూ:

“ఇదిగో.”

“అది డబ్బు చెల్లించినదానికి రశీదు. నేను అడుగుతున్నది చెట్లు నరకటానికి అనుమతి పత్రం.”

“పాత అటవీ అధికారి వెళ్లిపోయాడు కదా.”

"నువ్వు ఇల్లు కడుతున్నప్పుడు సంవత్సరం క్రితం అనుమతి తీసుకోవలసి ఉంది, నిన్న కాదు కదా?"

ఫ్యోడార్ ఇపటొవిచ్ బలంగా ఊపిరి పీల్చసాగాడు. అతడు అలసటగానూ, ఇబ్బందికరంగానూ ఉంది.

"మేము, అంటే పాత అటవీ అధికారీ, నేనూ చాలా స్నేహంగా ఉండేవాళ్లం. మా మధ్య ఎటువంటి రాతకోతలు ఉండేవి కావు. అతడు నాతో అవును, కాదని మాత్రమే చెప్పేవాడు. కాగితాల గురించి పట్టించుకునేవాళ్లం కాదు."

"చాలా వీలైన పద్ధతి."

"నన్ను ఎందుకు నమ్మరు, యూరి పెట్రోవిచ్? మీరు అడిగిన కాగితాలన్నింటినీ నేను –"

"సరే, మీ కాగితాలను నేను చూస్తాను. ఇప్పుడు మీరు ఇంటికి వెళ్లవచ్చు."

"నా ఫోల్డరు సంగతేమిటి?"

"దానిని నేను చూడాలి, బుర్యానోవ్. మంచిది."

"అంటే దానిని మీరు ఉంచుకుంటారా?"

"మీరేమీ ఆందోళన పడనవసరంలేదు, మీ కాగితాలకు ఏమీ కాదు. వెళ్లి రండి."

ఆ మాటలతో ఫ్యోడార్ ఇపటొవిచ్ తిరుగు ప్రయాణమయ్యాడు. తిరుగు దారంతటిలో అతడు చేప మాదిరి మౌనంగా ఉండిపోయాడు. ఈసారి కోపంతో కూడిన ఆలోచనల కారణంగా కాకుండా భయం వల్ల మౌనంగా ఉండిపోయాడు. ఈ భయం వల్ల అతడికి చమటలు పోశాయి, వణికిపోసాగాడు. తమ ఊరికి దగ్గరవుతున్న కొద్దీ ఎంతో కష్టంమీద తన శక్తినంతటినీ కూడగట్టుకుని ఎప్పటిమాదిరి స్వాతిశయం, ఆలోచనామగ్న ముఖకవళికలను ప్రదర్శించగలిగాడు.

అయితే, స్వాతిశయ, ఆలోచనా ముద్ర ముసుగు వెనక ఒక భయం తీవ్రంగా కలవరపెడుతోంది: అన్ని కాగితాలు ఉన్న తన ఫోల్డరును అటవీ వార్డెను ఎక్కడికి తీసుకెళుతున్నాడు? పోలీసుల దగ్గరకా? అలాగైతే అతడి పని అయిపోయినట్టే. స్నేహితులు, పరిచయస్తుల కళ్ల ముందే అతడు నీలి మంటల్లో తగలబడిపోతున్నా తనని బయటకు లాగటానికి ఒక్కళ్లు కూడా చిటికెన వేలు కూడా కదిలించరు. ఆ విషయం అతడికి బాగా తెలుసు. ఎందుకంటే తనే ఎవ్వరికీ అటువంటి సహాయం చెయ్యడు.

కానీ ఫ్యాడార్ ఇవటొవిచ్ ఆందోళనకు కారణం ఏమీ లేదు. కొత్త అటవీ వార్డెనుకి ఆ ఫోల్డరును ఎక్కడికీ పంపించే ఉద్దేశం లేదు. ఫ్యాడార్‌ని కమ్ముకున్న భయం, వెనక తేదీ వేసి చేసిన చెల్లింపు, అసలు ఆ మనిషే ఎందుకో వార్డెనుకి నచ్చలేదు. ఎటూ నిర్ణయించకుండా ఫ్యాడార్ ఇవటొవిచ్‌ని ఆ భయంతో ఉంచాలన్న ఆలోచన తప్పించి అతడికి వేరే అభిప్రాయం ఏమీ లేదు.

వార్డెను మాత్రం ఒక నిర్ణయం తీసుకున్నాడు: ప్రతిదీ తన కళ్లతో స్వయంగా చూడాలి. తన సంరక్షణలో ఉన్న ఆ అటవీ భాగాన్ని చూడాల్సిన సమయం ఆసన్నమయ్యింది. అయితే అకస్మాత్తుగా వెళ్లి ఆశ్చర్యపరచ దలుచుకున్నాడు కాబట్టి ఫ్యాడార్ ఇవటొవిచ్‌తో ఏమీ చెప్పలేదు. ఆ ఫోల్డరు పక్కన పెట్టాడు. మళ్లీ ఎప్పుడు తిరిగి వస్తాడో తెలియదు కాబట్టి కొన్ని రోజుల ముందుగానే పెద్ద అక్షరాలతో అమ్మకు ఉత్తరం రాశాడు. ఆ తరువాత ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోసాగాడు. అతడు తన సూట్‌కేసును తెరవటంతో (లెనిన్‌గ్రాడ్‌నుంచి బయలుదేరిన తరువాత అతడికి ఆ సూట్‌కేసును అప్పటివరకు తెరిచే అవసరమే రాలేదు) అన్నిటికంటే అడుగున ఒక ప్యాకెట్టు బయటపడింది. ఇక్కడి మారుమూల గ్రామంలో పనిచేస్తున్న ఒక బడి పంతులమ్మకి అందచేయమని మరెవరి ద్వారానో అతడికి అది అందింది. ఇప్పుడతడు అదే ఊరికి వెళుతున్నాడు.

ఇప్పటిదాకా దానిని అందింజేయని తన బాధ్యతారాహిత్యానికి యూరి పెట్రోవిచ్ సిగ్గుపడ్డాడు. దానిని కాసేపు పట్టుకుని, ఆ తరువాత తన భుజం సంచిలో పెట్టుకున్నాడు. అక్కడికి చేరుకోగానే, నల్ల చెరువుకి బయలుదేరటానికి ముందు దానిని అందచేయటానికి గుర్తుగా సంచిలో పైనే పెట్టాడు. ఆ తరువాత పాత పుస్తకాలు చదువుతూ చాలాసేపు గడిపాడు.

కానీ నోనా యురీవ్నాకి ఆ రాత్రి ఎటువంటి కలలు లేవు. జీవితం అంతే. ఒక్కొక్కసారి ఎటువంటి సంకేతాలను, సూచనలను ఇవ్వదు.

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige.com